క్లుప్తంగా

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

స్టేషన్ మహబూబ్‌నగర్: మనువాదుల నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకొని దేశాన్ని కాపాడుకుందామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నదని విమర్శించారు. పెట్టుబడిదారులను ఊడిగం చేస్తున్నదని ఆరోపించారు. రాజ్యాంగ మూలసూత్రాలకు తిలోదకాలు ఇస్తూ దేశ లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర స్ఫూర్తిని దెబ్బతీస్తున్నదని విమర్శించారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



చిన్నచింతకుంట: అప్పంపల్లిలో సీఎస్‌సీ హెల్త్ కేర్ మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో లేబర్ కార్డు ఉన్న కార్మికులకు సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. సభ్యులు యశ్వంత్ మాట్లాడుతూ వివిధ రంగాలల్లో పనిచేస్తు లేబర్ కార్డు ఉన్న ప్రతి కార్మికునికి 50 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పంచాయతి కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది రాకేష్, శివలీలతో పాటు పలువురు ఉన్నారు.

ఎస్సీ కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి



నవాబుపేట: మాదాసీ, కురుమలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీచేయాలని సంఘం నాయకులు వెంకటేష్, శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని జంగమయ్యపల్లిలో ఆందోళన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ నెల 14న జడ్చర్లలో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు వెంకట్ రాజ్, దరిపల్లి జంగయ్య, నారాయణ, నర్సింహులు, ఆల్లెశ్రీను, బెరేటి అంజనయ్య, రమేష్, యాదగిరి, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

మీనాంబరంలో మాసశివరాత్రి వేడుకలు



జడ్చర్ల: ఆల్వాన్‌పల్లి సమీపంలోని మీనాంబరం ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి శ్రీ మహాగౌరీ పరుశవేదీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, పల్లకీసేవ, ప్రసాద వితరణ, భజనలు, తదితర ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గోపాల్, శ్రీనివాస్, లావణ్య, యాదయ్య, కైలాస్, సునీత, భద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వేసవి నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పద్మ శాలి సంఘం అధ్యక్షుడు అనంత రాములు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం కొత్త బస్టాండ్ చౌరస్తాలో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, సూర్యప్రతాప్, బాలరాజు, శంకర్, బుచ్చన జన్ను, వెంకటేష్, సుకుమార్, దాసు, వెంకటేష్, రాజశేఖర్, సత్యం, యూత్ అధ్యక్షుడు నీలికిషోర్, శ్రీనివాస్, ప్రవీణ్, సంతోష్, అంజి, రాములు పాల్గొన్నారు.

అనుమతులు రద్దు చేయండి

జడ్చర్ల: బాదేపల్లిలోని బీవీ రావు నగర్ కాలనీలో గల గ్రామపంచాయతీ పార్కు స్థలాన్ని అక్రమించి చేపట్టిన ఇళ్ల నిర్మాణాల అనుమతులను రద్దు చేయాలని ఆ వార్డు కౌన్సిలర్ ఉమా శంకర్‌గౌడ్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 47లో గ్రామ పంచాయతీ కమ్యూనిటీ అవసరాలకు వదలిన 1788 చ.గ.స్థలాన్ని అక్రమించారన్నారు. అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకుని ఇళ్ల నిర్మాణాలను చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

'పూలే జయంతి అన్ని గ్రామాల్లో నిర్వహించాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అన్ని గ్రామ పంచాయతీలలో జ్యోతిబా పులే జయంతి అధికారికంగా నిర్వహించాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ రవినాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అధికారికంగా సెలవు దినం ప్రకటించాలని కోరారు. గొడుగు నర్సిములు, రవికుమార్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఆందోళన



ఆందోళన చేస్తున్న చౌటపల్లి వాసులు

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన చౌటపల్లి వాసులు

- వారం రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన
- సమస్య పరిష్కారం మాదికాదంటున్న ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్‌భగీరథ అధికారులు



గ్రామంలో ఖాళీ బిందెలతో గ్రామస్తులు

నవాబుపేట: వారం రోజులైంది.. చుక్కా నీరు రావడం లేదంటూ ఊరు ఊరే రోడ్డెక్కింది. తాగునీటి విషయంలో ఎవరికి చెప్పినా పట్టించుకోవటం లేదంటూ గ్రామస్తులు ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. మండల పరిధిలోని చౌటపల్లిలో మిషన్ భగీరథ నీరు రావటం లేదు. వారం రోజులుగా నల్లాలు సరిగ్గా రావటం లేదని సంబంధిత అధికారులకు వివరించినా.. వారు పట్టించుకోలేదని అందుకే సోమవారం ఇంటికొకరి చొప్పు ఖాళీ బిందెలతో రోడ్డెక్కినట్లు గ్రామస్తులు వివరించారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో ఖాళీ బిందెలు ఉంచి నిరసన తెలియజేశారు. కాగా అధికారులు తమది కాదని ఒకరు, తమది కాదని మరొకరు మాటలు దాటేస్తున్నారని, సమస్యను మాత్రం పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

మాది కాదంటే మాది కాదు..

చౌటపల్లిలో నీటి సమస్య తమది కాదంటే, తమది కాదని ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు ఇద్దరూ వాదించుకుంటూ గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలిగించారు. నల్లాలు ఏర్పాటు చేయటం తమ బాధ్యత కాగా.. నీళ్ల వచ్చేలా చూసుకోవటం మిషన్ భగీరథ అధికారులదని, అధికారులు వాదిస్తూ.. సమస్యను పట్టించుకోలేదు. గ్రామ సమీపంలో పైప్ లైన్ మొరాయించటంతో చౌటపల్లికి నీటి సమస్య ఏర్పడింది. కాగా ఈ సమస్యను మిషన్ భగీరథ అధికారులు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వాదిస్తుండగా పర్యవేక్షణ వాళ్లదేనని మిషన్‌భగీరథ అధికారులు వాదిస్తూ.. వాచ్చరు. దీంతో సమస్య తీవ్రమైంది.

ఓపిక లేకనే రోడ్డుపైకి వచ్చాం..



నల్లాలు రావటం లేదని వారం రోజులుగా చెబుతున్నా.. ఎవరూ పట్టించుకోలేదు. పైగా నల్లాల పని మాది కాదని ఒక అధికారి, తమది కాదని మరో అధికారి మాటలు దాటవేస్తూ.. వచ్చారు. ఇక ఓపిక లేకనే రోడ్డుపైకి వచ్చాం. గ్రామం మొత్తం రోడ్డెక్కి బిందెలతో నిరసనకు దిగితేనే అధికారులు ఫోన్లు చేయటం మొదలుపెట్టారు. మాకు నీళ్ల వచ్చే దాకా ఆందోళన చేస్తామని చెప్పటంతో అధికారులు దిగొచ్చి పనులు చేసి నీళ్ల ఇస్తామని చెప్పారు.

– వెంకటమ్మ, చౌటపల్లి

సమస్య ఆలస్యంగా తెలిసింది...

తాగునీటి సమస్య ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చూసుకోవాలి. వారు పట్టించుకోలేదు. తీరా సమస్యను సోమవారం తమకు వివరిస్తే తాము దాన్ని పరిష్కరించే పనిలో ఉన్నామని మిషన్ భగీరథ అధికారులు వివరించారు. కాగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాత్రం గ్రామంలో నల్లాలు రిపేర్లు చూస్తామని కాని నీటి సరఫరా బాధ్యత మిషన్ భగీరథ అధికారులదని, వారికి సమస్యను ముందుగానే చెప్పినా పట్టించుకోలేదని వాదించారు. చివరికి చౌటపల్లి గ్రామ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని భగీరథ అధికారులు ప్రకటించారు.

కల్లేపల్లి నుంచి వానరాల తరలింపు



నల్లమల్ల తరలించేందుకు బోనులో ఉంచిన వానరాలు

- మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



కల్లేపల్లిలో వానరాలకు అరటి పండ్లు వేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: కల్లేపల్లి నుంచి నల్లమల్ల అడవికి వానరాల తరలింపు సోమవారం చేపట్టారు. కాగా వానరాల నుంచి ఎదురయ్యే కష్టాల విముక్తి కల్పించాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రచారానికి వెళ్లిన సందర్భంగా గ్రామస్తులు ఆయనకు విన్నవించారు. కాగా ఎన్నికలు ముగిసిన వెంటనే చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. గతనెలలో సాక్షిలో పత్రికలో సైతం వానరాలతో ఇబ్బందులు అంటూ కథనం వచ్చింది. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వానరాలను తరలించేందుకు తిరుపతి నుంచి ప్రత్యేక నైపుణ్యం ఉన్నవారిని రప్పించారు. ఒక్కో వానరాలనికి రూ. 500 వందలచొప్పున వారికి ఇచ్చే విధంగా మాట్లాడారు. దీంతో సోమవారం నుంచి కార్యక్రమం ప్రారంభించారు. దాదాపు వంద వానరాలను నల్లమల్లకు తరలించేందుకు సిద్ధం చేశారు. ఎమ్మెల్యే స్వయంగా గ్రామానికి వచ్చి వానరాలకు అరటిపండ్లను వేశారు. జాగ్రత్తగా నల్లమల్ల అడవిలో వదిలి పెట్టాలని సూచించారు.

సమస్య తీరబోతోంది



కొన్ని సంవత్సరాలుగా సాగు చేసుకున్న పంటలను వానరాలు పాడు చేస్తున్నాయి. గ్రామానికి వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులకు సమస్యనే వివరించేవాళ్లం. కానీ ఎవ్వరు పట్టించుకోలేదు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఎన్నికల ముందు మాగ్రామానికి వచ్చి హామీ ఇచ్చారు. మాట ప్రకారం చర్యలు తీసుకుంటున్నందుకు సమస్య తీరబోతోంది.

– వెంకట్‌రెడ్డి, రైతు, కల్లేపల్లి

నా సమస్యగా భావించా..

వానరాల బారి నుంచి గ్రామస్తులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యను నా సమస్యగా భావించాను. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్కలతో చర్చించి వానరాలను తరలించేందుకు చర్యలు తీసుకున్నాం. గ్రామంలో చిన్నపిల్లలను సైతం వానరాలు గాయపరుస్తున్న విషయాలు నా దృష్టికి వచ్చాయి. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా. మిగతా గ్రామాల్లో కూడా వానరాల సమస్య ఉందని సమస్య పరిష్కరించాలని ఫోన్లు వస్తున్నాయి.

– జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

కోయిల్‌కొండ: పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొత్లాబాద్‌లో మల్లికార్జునస్వామి బోనాల ఉత్సవాలలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ తమ ప్రభుత్వం వందరోజుల్లోనే హామీలన్నీ అమలు చేసిందన్నారు. కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. బీఆర్‌ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మె పరిస్థితి లేదన్నారు. బ్లాక్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్‌గౌడ్, మండల అధ్యక్షుడు జి.రవీందర్, ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ, నాయకులు సత్యపాల్‌రెడ్డి, రామస్వామి, సాయి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోతీఘనపూర్‌లో ఇఫ్తార్ ఏర్పాటు

బాలానగర్: మండల పరిధిలోని మోతీఘనపూర్‌లో ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిందూ, ముస్లింలు అనే తారతమ్యాలకు తావు లేకుండా మత సామరస్యాన్ని చాటుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో రఫీక్, మాజీద్, వాజీద్, మోసిన్‌లతోపాటు పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చెత్తను రోడ్డు పక్కన వేయొద్దు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రోడ్ల పక్కన ఎవరూ చెత్తను పడేయొద్దని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి సూచించారు. స్థానిక 13వ వార్డు పరిధిలోని బండమీదిపల్లిలో అల్లీపూర్ రోడ్డు పక్కన కొన్ని రోజులుగా చెత్తను కొందరు డంప్ చేస్తున్నారని ఫిర్యాదు అందడంతో సోమవారం ఉదయం అక్కడికి వెళ్లి ఆయన పరిశీలించారు. వెంటనే డోజర్ సాయంతో చెత్తకుప్పలను తొలగింపజేశారు.

గర్భసంచి నుంచి 22 కణతుల తొలగింపు

పాలమూరు: తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న ఓ మహిళకు ఎస్‌వీఎస్‌లో సర్జరీ ద్వారా గర్భసంచిలో ఏర్పడిన 22 కణుతులను సోమవారం తొలగించారు. వివరాలు ఇలా.. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ఎదిరకు చెందిన మణెమ్మ రెండు ఏళ్లుగా తీవ్ర రక్తస్రావంతో ఇబ్బంది పడుతోంది. ఆస్పత్రుల్లో చూపించినా తగ్గలేదు. ఇటీవల ఎస్‌వీఎస్‌లో గైనిక్ ఎండీ డాక్టర్ పల్లి సుధీర్‌బాబును సంప్రదించగా పరీక్షలు నిర్వహించి గర్భసంచిలో కణుతులు ఉన్నట్లు గుర్తించారు. సోమవారం సర్జరీ నిర్వహించారు. దాదాపు మూడు గంటలు శ్రమించి సర్జరీ విజయవంతంగా పూర్తి చేశారు.

13 నుంచి సప్తాహ మహోత్సవాలు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: పట్టణంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి ఆలయ 95వ సప్తాహ మహోత్సవాలు ఈ నెల 13 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల నిర్వహణ కోసం కమిటీ ఏర్పాటు చేశారు. 20 వరకు అఖండ భజనలు నిర్వహిస్తారు. 18న ప్రభోత్సవం , 19న రథోత్సవం, 20న ప్రత్యేక పూజలు ఉండనున్నాయి. కాగా ఉత్సవాలకు సంబంధించిన ప్రత్యేక పోస్టర్‌ను ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సోమవారం విడుదల చేశారు. సప్తాహ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని అందుకు తగిన ఏర్పాట్లను చేయాలని, భక్తులకు కావలసిన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే కమిటీ వారికి సూచించారు. తాగునీటిని అందుబాటులో ఉంచాలని నిత్యం అన్నదానం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ బీసు నర్సింహారెడ్డి, సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి, వెంకటయ్య, మల్లేశ్, నరేష్, రఘు, బీరప్ప, నర్వ శ్రీనివాస్‌రెడ్డి, రామాంజనేయులు, వర్మ పాల్గొన్నారు.

సోదరభావంతో జీవిద్దాం



స్టేషన్ మహబూబ్‌నగర్: సోదరభావంతో కలిసిమెలిసి జీవిద్దామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని న్యూప్రేమ్‌నగర్, మోనప్పగుట్టలో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముస్లింలకు ఖజూర్, పండ్లు తినిపించి ఉపవాస దీక్షలు విరమింపజేశారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, నాయకులు సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, అజ్మత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యత



స్టేషన్ మహబూబ్‌నగర్: ముస్లింల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్‌తో కలిసి పాల్గొన్నారు. కాంగ్రెస్ ముస్లింల సంక్షేమాన్ని మరిచిందన్నారు. ముస్లిం మతపెద్దలు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

పాలమూరు: సినీహీరో అల్లు అర్జున్ జన్మదినం సందర్భంగా.. ఆతడి ఫ్యాన్స్, వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని పాలమూరు బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా అభిమానులు అధికంగా హాజరై రక్తదానం చేశారు. జిల్లా అధ్యక్షుడు రాజు, అభిమానులు గిరి, రవి,నరేష్, సమీర్, యాది, లక్ష్మణ్, వెంకటేష్, పాలమూరు బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు నివారించవచ్చు

రాజాపూర్: కుష్టును ఏ దశలో ఉన్నా నయం చేయవచ్చని జిల్లా లెప్రసీ అధికారిని డాక్టర్ జరీనా పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో 20 మంది అనుమానితులను పరీక్షించి ఒకరికి వ్యాధి ఉన్నట్లు గుర్తించామన్నారు. మండల వైద్యాధికారి మధుసూదన్‌రావ్, జిల్లా పారామెడికల్ అధికారులు నర్సింహారెడ్డి, హనుమంతరావ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతతో పనిచేయాలి

- మూసాపేట మండల సభలో ఎంపీపీ కళావతి



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఎంపీపీ గూపని కళావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, ఎంపీడీఓ కృష్ణయ్య తదితరులు సభకు హాజరయ్యారు. 8 మంది ఎంపీటీసీలకు గాను ఎంపీపీతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన సభ్యులు సీజీ.గోవర్ధన్, సత్యనారాయణ, సంతోషి మాత్రమే సభకు హాజరయ్యారు. మిగిలిన నలుగురు బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు సభకు గైర్హాజరయ్యారు. గ్రామాల్లో ప్రత్యేక పాలన కొనసాగుతున్న నేపథ్యంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సభకు హాజరయ్యారు. ఇదిలా ఉండగా గతంలో ఎంపీటీసీ నిధుల ద్వారా పనులు చేస్తే బిల్లులు రాలేదని ఎంపీటీసీ సభ్యులు వాపోయారు. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదవి వినిపించారు. గ్రామాల్లో స్థానిక అవసరాలకు ఇసుక తరలించుకునేలా చర్యలు తీసుకోవాలని నిజాలాపూర్ ఎంపీటీసీ సీజీ.గోవర్ధన్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి ఉచిత ఇసుక సరఫరాపై ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదని తహసీల్దార్ బ్రహ్మంగౌడ్ తెలిపారు. గ్రామాల్లో పాత ఇళ్లను బాగు చేయించుకుంటే వాటికి ఇసుక అనుమతి ఇవ్వాలని సభ్యులు కోరగా ఇందుకు సంబంధించిన దరఖాస్తును పంచాయతీ కార్యదర్శికి అందజేసి దానితో పాటు పాత ఇంటి వద్ద దిగిన ఫోటోను జత చేయాలని సూచించారు. కాగా వేసవికాలమైనందున గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ కృష్ణయ్య కార్యదర్శులకు సూచించారు. బోరు మోటార్లు, పైప్‌లైన్లకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. కాగా అధికారులు బాధ్యతతో పని చేయాలని ఈ సందర్భంగా ఎంపీపీ కళావతి సూచించారు. ఇదిలా ఉండగా సర్పంచుల పదవీ కాలం ముగియడంతో వారు లేక సభలో సమస్యలను లేవనెత్తే వారు కరువై సభ మొక్కుబడిగా సాగింది. కార్యక్రమంలో ఏఓ రాజేందర్‌రెడ్డి, ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి, ఏపీఓ పులేందర్, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

'ఉపాధి' కూలీలను ఆదుకోవాలి

జడ్చర్ల టౌన్: ఉపాధి కూలీలను ఆదుకోవాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ నేతృత్వంలో సోమవారం స్థానిక ఎంపీడీఓ భాస్కర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా జగన్ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజుకు కనీస కూలి రూ.600 వచ్చేలా చూడాలని కోరారు. కూలీలను పనికి దూరం చేయాలనే కుట్రతో కనీస కూలి రూ.272గా నిర్ణయించారన్నారు. దానికి అదనంగా రూ.28 పెంచి ఏప్రిల్ నుంచి రూ.300 ఇవ్వాలని నిర్ణయించటం సరైంది కాదన్నారు. పని ప్రాంతంలో కనీసం మంచినీటిని ఏర్పాటు చేయడం లేదని వాపోయారు. పేదల ప్రభుత్వంగా చెప్పుకుంటున్న బీజేపీ కూలీలను ఉపాధి హామీకి దూరం చేయాలని చూస్తుందని ఆరోపించారు. యాదయ్య, సుందరమ్మ, పాండు, నరసింహ, పోశయ్య ఉన్నారు.

పార్టీ విజయం కోసం కృషి చేయాలి



సమావేశానికి తరలివెళ్లిన కార్యకర్తలు

మహమ్మదాబాద్: పార్టీ గెలుపుకోసం ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. సోమవారం పరిగిలో చేవెళ్ల ఎంపీఅభ్యర్థి రంజిత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బూత్‌లెవల్ కార్యకర్తల సమావేశానికి మండలం నుంచి భారీగా కార్యకర్తలు తరలివెళ్లారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు కార్యకర్తలు కృషిచేయాలన్నారు. రాంలాల్, విష్ణురెడ్డి, ఎంపీటీసీ చెన్నయ్య, రహీం, కేశవులు, శివ ఆయా గ్రామాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: పరిగి నియోజకవర్గ బూత్ స్థాయి సమావేశానికి గండేడ్ మండలం నుంచి పలువురు కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గండేడ్, వెన్నాచేడ్, సల్కర్‌పేట్, కొంరెడ్డిపల్లి, పెద్దవార్వాల్, చిన్నవార్వాల్, రుసుంపల్లి, కష్లాపూర్ ,లింగాయిపల్లి తదితర గ్రామాలకు చెందిన బూత్‌ఎన్‌రోలర్స్, బూత్ ఏజంట్లు తరలివెళ్లారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

భూత్పూర్: మహాత్మా జ్యోతిబా పులే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 250 మందికి పరీక్షలు చేయగా 23 మందికి కంటి అద్దాలు అవసరమని వైద్యులు తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. శంకర్ పలు సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి, ఇస్తున్న ఆహారంపై ప్రత్యేక అధికారి బస్వరాజ్‌ను జిల్లా వైద్యాధికారి డా. కృష్ణ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కంటి వైద్యాధికారి డా. దత్తు తదితరులు ఉన్నారు.

'ప్రెస్‌క్లబ్ ఏ ఒక్క యూనియన్ సొత్తు కాదు'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని ప్రెస్‌క్లబ్ ఏ ఒక్క యూనియన్ సొత్తు కాదని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకిట అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక మెట్టుగడ్డలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ డైట్ కాలేజీ ఆవరణలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే ప్రెస్‌క్లబ్ నిర్మాణం జరిగిందన్నారు.పాలమూరు ప్రెస్‌క్లబ్ యూనియన్లకు అతీతమైందని, ఇది అందరి జర్నలిస్టులదని గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు సందర్‌చారి, అనిల్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలు తప్పనిసరి: టీపీఓ



మాట్లాడుతున్న టీపీఓ లక్ష్మీపతి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: భూగర్భ జలాల పరిరక్షణలో భాగంగా ప్రతి ఇంటి వద్ద ఇంకుడుగుంత నిర్మించుకోవాలని యజమానులకు టీపీఓ లక్ష్మీపతి సూచించారు. ఈ విషయమై సోమవారం స్థానిక చిన్నదర్‌పల్లి, పాలకొండ తదితర ప్రాంతాలలో భవన నిర్మాణ మేస్త్రీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఇళ్ల నిర్మాణం చేసేటప్పుడు ఈ ఇంకుడుగుంత తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలకు వీటి నిర్మాణంపై అవగాహన కల్పించారు.